క్లుప్తంగా

వరలక్ష్మి దశ దినకర్మకు హాజరైన నేతలు



వరలక్ష్మి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నేతలు

కనిగిరిరూరల్: దివంగత మాజీ ఎమ్మెల్యే భూతలపల్లి రామసుబ్బారెడ్డి పెద్ద కోడలు భూతలపల్లి వరలక్ష్మి దశదినకర్మ కార్యక్రమం గురువారం స్థానిక పాతూరులో జరిగింది. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ సీఈసీ మెంబర్, మాజీ ఎమ్మెల్యే జంకె వెంకటరెడ్డి, మాజీ ఎమ్మెల్యే, విశాఖపట్నం పార్లమెంట్ పరిశీలకుడు కదిరి బాబురావు, మాజీ మంత్రి ముక్కు కాశిరెడ్డి, పీడీసీసీ బ్యాంకు మాజీ చైర్మన్ వైఎం ప్రసాద్‌రెడ్డి, మాజీ ఏఎంసీ చైర్మన్ సరితారెడ్డి, మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్, చెగిరెడ్డి రామలింగారెడ్డి తదితరులు పాల్గొని చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మాజీ కౌన్సిలర్లు షేక్ ఫయాజ్, సయ్యద్ నాయబ్ రసూల్, ముత్యాల ప్రతాప్ పాల్గొన్నారు.

407 బేళ్ల తిరస్కరణ

కొండపి: స్థానిక పొగాకు వేలం కేంద్రంలో గురువారం నిర్వహించిన వేలంలో 407 బేళ్లు తిరస్కరణకు గురయ్యాయి. క్లస్టర్ పరిధిలోని అయ్యప్పరాజుపాలెం, నరసరాజుపాలెం, పెద్దకండ్లగుంట గ్రామాల రైతులు 1253 బేళ్లను తీసుకురాగా 846 బేళ్లను కొనుగోలు చేసి 407 బేళ్లను తిరస్కరించారు. గరిష్ట ధర రూ.315, కనిష్ట ధర రూ.70, సరాసరి ధర రూ.220.11గా నమోదైంది. వేలంలో 17 కంపెనీలు పాల్గొన్నాయి.

టంగుటూరు: స్థానిక పొగాకు వేలం కేంద్రం పరిధిలో గురువారం నిర్వహించిన వేలంలో 864 పొగాకు బేళ్లు కొనుగోలు వ్యాపారులు కొనుగోలు చేశారు. పొందూరు గ్రామానికి చెందిన రైతులు 1060 బేళ్లను తీసుకురాగా 196 బేళ్లను తిరస్కరించారు. గరిష్ట ధర రూ.316, కనిష్ట ధర రూ.70, సరాసరి ధర రూ.242.23గా నమోదైంది. వేలంలో 40 మంది వ్యాపారులు పాల్గొన్నారు.

ఉన్నత విద్యతో ఉజ్వల భవిష్యత్



విద్యార్థులకు డిగ్రీ పట్టాలు అందజేస్తున్న దృశ్యం

సీఎస్‌పురం(పామూరు): విద్యార్థి దశలో ఇష్టంతో కష్టపడి ఉన్నత విద్యనభ్యసిస్తే ఉజ్వల భవిష్యత్ సాధ్యమని కదిరి బాబూరావు వ్యవసాయ కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ కదిరి పార్థసారది, ఎంఈఓ రాజాల కొండారెడ్డి అన్నారు. కళాశాల మినీ ఆడిటోరియంలో వ్యవసాయకళాశాల విద్యార్థుల గ్రాడ్యుయేషన్ డే వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. పీజీస్థాయి కోర్సులు అభ్యసించి తమ జీవన ప్రగతిని ఉన్నతంగా తీర్చిదిద్దుకోవాలన్నారు. డీన్ వీరన్నగౌడ్, వ్యవసాయ కళాశాల డీన్ డాక్టర్ పి.వీరన్నగౌడ్, కనిగిరి కెనరా బ్యాంక్ సీనియర్ మేనేజర్ వి.సుదీప్‌ప్రశాంత్, మేనేజర్ కె.విజయలక్ష్మి, ఎం నారాయణరెడ్డి, మూరం కాశిరెడ్డి, టి.బాబూరావు, కొట్టే శ్రీను, నున్నా నారాయణ తదితరులు పాల్గొన్నారు.

హాస్టళ్లలో కనీస సౌకర్యాలు కల్పించాలి

పీసీపల్లి: బాలుర వసతి గృహంలో కనీస సౌకర్యాలు కల్పించాలని సీపీఎం ప్రాంతీయ కమిటీ కన్వీనర్ బడుగు వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. స్థానిక వసతి గృహాన్ని సీపీఎం బృందం గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా హాస్టల్‌లో కనీస సౌకర్యాలు లేక ఇబ్బందులు పడుతున్నారని, సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. సీపీఎం నాయకులు మచ్చ వేణుగోపాల్, జగదీష్, కోడూరి మధుసూదన్, అంద్రా వరుణ్ సందీప్, ఇజ్రాయిల్ ఉన్నారు

విద్యుత్ చౌర్యానికి పాల్పడిన 19 మందిపై కేసు నమోదు

సీఎస్‌పురం(పామూరు): మండలంలో విద్యుత్ చౌర్యానికి పాల్పడ్డ 19 మందిపై కేసు నమోదు చేసినట్లు విజిలెన్స్ ఈఈ హైమావతి తెలిపారు. స్థానిక విద్యుత్‌శాఖ కార్యాలయంలో గురువారం విజిలెన్స్ దాడుల వివరాలను వెల్లడించారు. మండలంలో విద్యుత్ విజిలెన్స్ అధికారులు 24 బృందాలుగా ఏర్పడి 19 మంది విద్యుత్ అక్రమ వినియోగ దారులను గుర్తించి వారికి రూ.1.33 లక్షలు జరిమానా విధించినట్లు తెలిపారు. విజిలెన్స్ ఈఈలు కె.వెంకటేశ్వర్లు, పీజీ నారాయణ, కె.వెంకటేశ్వర్లు, కె.కోటేశ్వరరావు, ఉమాకాంత్, డీఈ కృష్ణారెడ్డి, ఏఈ ఎల్.రమేష్ పాల్గొన్నారు.

11.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు

సింగరాయకొండ: మండలంలో గురువారం 11.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోనదైనట్లు ఏఎస్ఓ శ్రీనివాసులు తెలిపారు. ఈ వర్షం వరిసాగుకు ఎంతో అనుకూలమని, రైతులు పొలాలు దుక్కులు దున్నుకోవటానికి ఉపయోగంగా ఉందని వ్యవసాయాధికారులు వివరించారు. వర్షం కారణంగా రోడ్లు బురదమయంగా మారాయి. జరుగుమల్లి మండలంలో 3.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు ఏఎస్ఓ సుబ్రహ్మణ్యం వివరించారు.

కూలబడిన అభివృద్ధి

- ప్రభుత్వ పాఠశాలలపై కక్ష
- 16 నెలల్లో ఒక్క రూపాయి విదిల్చితే ఒట్టు
- ఎక్కడికక్కడ నిలిచిన నాడు–నేడు పనులు
- ఇరుకుగదులు, వరండాల్లో విద్యాభ్యాసం
- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న విద్యార్థులు, తల్లిదండ్రులు



పీసీపల్లి మండలంలో మురిగమ్మిలో ఆగిన అదనపు తరగతి పాఠశాల భవనం ఇదే



పునుగోడు ఎంపీపీఎస్ స్కూల్‌లో నిలిచిన ఫ్లోరింగ్ పనులు

కనిగిరిరూరల్:

కూటమి ప్రభుత్వంలో ప్రభుత్వ పాఠశాలలకు చంద్రగ్రహణం పట్టింది. ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఎక్కడ పనులు అక్కడే నిలిచిపోయాయి. గత వైఎస్సార్ సీపీ హయాంలో ఎంతో ప్రతిష్టాత్మకంగా నాడు–నేడు పథకాన్ని ప్రవేశపెట్టి పాఠశాలల రూపురేఖలు మార్చేశారు. తొలి విడతలో వేల పాఠశాలల్లో కార్పొరేట్ పాఠశాలలను తలదన్నేలా సౌకర్యాలు ఏర్పాటు చేశారు. రెండో దశలో పనులు జరుగుతుండగా కూటమి సర్కారు అధికారంలోకి వచ్చిన తర్వాత సరస్వతీ నిలయాలపై వివక్ష చూపుతోంది. అధికారంలోకి వచ్చిన 16 నెలల్లో ఒక్క రూపాయి కూడా పాఠశాలల అభివృద్ధికి విదిల్చలేదు. ఫలితంగా విద్యార్థులు అవస్థల నడుమ విద్యను సాగిస్తున్నారు. వైఎస్సార్ సీపీ హయాంలో నియోజకవర్గంలో తొలి విడతలో 161 పాఠశాలలకు రూ.35.40 కోట్ల నిధులు మంజూరు కాగా ఆ పాఠశాలల్లో పనులన్నీ పూర్తయ్యాయి.

ప్రభుత్వ పాఠశాలలపై ఎందుకంత కక్ష..?

నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో రెండో విడత నాడు– నేడు పథకం కింద 127 పాఠశాలలు ఎంపికయ్యాయి. దానికి సంబంధించి గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో రూ.55.20 కోట్లు నిధులు మంజూరు కాగా అందులో రూ. 29.04 కోట్లు ఖర్చు చేశారు. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వంలో ఒక్క రూపాయి విడుదల చేయలేదు. దీంతో ఎక్కడి పనులు అక్కడే అర్ధాంతరంగా నిలిచాయి. కొన్ని పాఠశాలల్లో కేవలం ఫ్లోరింగ్, కిటికీలు, వంటి చిన్న చిన్న పనులు చేస్తే.. విద్యార్థులు ప్రశాంతంగా చదువుకునే పరిస్థితి. అయినా కూటమి ప్రభుత్వం పేద విద్యార్థుల చదువు పట్ల జాలి చూపకపోవడంతో నేలపై, ఇరుకు గదుల్లో విద్యా బోధన చేస్తున్నారు.

✎ కనిగిరి పట్టణంలోని నాల్గవ వార్డు(ప్రస్తుతం, 8వ వార్డు) ఉర్దూ పాఠశాలలో నాల్గు అదనపు తరగతి గదుల భవన నిర్మాణాలు నిలిచాయి. నాడు–నేడు పథకం కింద నిధులు మంజూరు కాకపోవడంతో విద్యార్థులు ఇరుకుగదుల్లో, నేల పై కూర్చొని, అసౌకర్యాలతో ఇబ్బందులు పడుతున్నారు. 3వ వార్డులోని ఎంపీయూపీ స్కూల్, దిరిశవంచ, కొత్త ఏరువారిపల్లి, జెడ్పీ హెచ్ఎస్ ఉన్నత పాఠశాల, ఎంపీపీఎస్ యడవల్లి, చాకిరాల, మాచవరం, వాగుపల్లి, పునుగోడు, తుమ్మగుంట, బడుగులేరు, జెడ్పీ గరల్స్‌లో (2 గదులు) పాఠశాలలు కూడా నాడు నేడు రెండో విడత నిధులు మంజూరు కాగా పనులు నిలిచాయి. చిన్న చిన్న పనులు జరిగితే పాఠశాల అభివృద్ధి పనులు పూర్తి అయ్యే పరిస్థితి.

✎ కనిగిరి మండలంలో రెండో విడతలో సుమారు రూ.20 కోట్ల పాఠశాలల అభివృద్ధికి నిధులు మంజూరు కాగా ఎన్నికల నాటికి సుమారు రూ.13 కోట్ల పనులు జరిగాయి. అవి కాగా పాఠశాలకు కావాల్సిన సిమెంట్, శానిటరీ, సిరామిక్ టైల్స్ తదితర వస్తువులు మంజూరు చేశారు. మరో 30 శాతం పనులు పూర్తి చేస్తే.. పాఠశాలల అదనపు గదుల నిర్మాణాలు పూర్తిగా వినియోగంలోకి వస్తాయి. కానీ నేటి ప్రభుత్వం కనీసం దృష్టి పెట్టడం లేదు.

✎ హనుమంతునిపాడు మండలంలోని సీతారాంపురం, నందనవనం, లింగం కుంట్ల, మొహ్మదాపురం, నీలకంఠాపురం, చినముప్పళ్లపాడు జెడ్పీ ఉన్నత పాఠశాలు, నందనవనం (ఎంపీయూపీఎస్) స్కూల్స్‌లో రెండో విడత నాడు– నేడు నిధులు విడుదల కాక పాఠశాల పనులు అర్ధంతరంగా నిలిచాయి.

✎ సీఎస్‌పురం మండలంలో నాడు– నేడు రెండో విడత కింద 18 పాఠశాలలకు రూ.8 కోట్లు మంజూరుకాగా పనులు ప్రహరీల నిర్మాణం, అదనపు తరగతి గదుల నిర్మాణం పనులు సగం జరిగాయి. ప్రభుత్వ మారిన తర్వాత నిధులు రాకపోవడంతో మిగతా పనులు అర్ధంతరంగా నిలిచాయి.

✎ పామూరు మండలంలో నాడు నేడు పథకం రెండో విడతకింద 25 పాఠశాలలకు రూ.14 కోట్లు మంజూరు కాగా వాటిలో సగానికి పై నిధులు ఖర్చు చేశారు. ఆతర్వాత ప్రభుత్వం మారడంతో నిధులు ఇవ్వకపోవడంతో మిగతా పనులు నిలిచాయి. దీంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. తూర్పుకట్టకిందపల్లె ఎంపీయూపీ పాఠశాలకు రెండవ విడతలో రు.42 లక్షలు మంజూరయ్యాయి. అదనపు గదులు, మరుగుదొడ్లు, వంటగది పనులు ప్రారంభించారు. రూ 13లక్షల వరకు ఖర్చు పెట్టారు. కూటమి ప్రభుత్వం వచ్చాక నిధులు నిలిపి వేయడంతో పాఠశాలల్లోని అభివృద్ధి పనులు ఎక్కడి కక్కడ నిలిచాయి. దీంతో ఈ పాఠశాలకు చెందిన 33 మంది విద్యార్థులు సమీప ఎస్సీ కాలనీ ఎంపీపీఎస్‌కు వెళ్తున్నారు. అక్కడ స్థల లేమితో ఇరుకు గదుల్లో విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. మోపాడులోని పాఠశాల భవన నిర్మాణపనులు నిలిచిపోవడంతో అక్కడ కూడా విద్యార్థులు ఇక్కట్లు పడుతున్నారు.

✎ పీసీపల్లి మండలంలో రెండో విడతలో మొత్తం 12 పాఠశాలలు మంజూరు కాగా అందులో మూడు అంగన్వాడీలు 9 పాఠశాలలున్నాయి. ప్రభుత్వం మారిన తర్వాత నిధులు ఇవ్వక పోవడంతో ఆయా పాఠశాలల, అంగన్‌వాడీల పనులు వివిధ దశల్లో నిలిచాయి. కస్తూర్బా పాఠశాలలో అదనపు తరగతులు భవనాలు స్లాబ్ దశలో, మురుగమ్మి ఉన్నత పాఠశాల పిల్లర్లు బేస్‌మట్టం స్థాయిలో నిలిచాయి. వెలిగండ్ల మండలంలోని రెండో విడత కింద మంజూరైన వివిధ పాఠశాలలకు సంబంధించి సుమారు రూ.కోటి పనులు నిలిచి పోయాయి. అనేక పాఠశాలల్లో పనులు చివరి దశల్లో ఆగడంతో విద్యార్థులు అవస్థల నడుమ విద్యాభ్యాసం చేస్తున్నారు.

మండలం	రెండో విడత ఎంపికైన పాఠశాలలు	మంజూరైన నిధులు	ఖర్చు చేసిన నిధులు(దాదాపు)
కనిగిరి	46	రూ. 21.20 కోట్లు	రూ. 11కోట్లు
పామూరు	25	రూ. 14 కోట్లు	రూ 6.97 కోట్లు
సీఎస్‌పురం	18	రూ. 8కోట్లు	రూ. 4.07 కోట్లు
హెచ్ఎం పాడు	9	రూ. 2 కోట్లు	రూ.కోటి
పీసీపల్లి	9	రూ. 3కోట్లు	రూ. 2 కోట్లు
వెలిగండ్ల	20	రూ. 7కోట్లు	రూ. 6కోట్లు
	127	రూ. 55.20 కోట్లు	రూ. 29.04 కోట్లు



హెచ్‌ఎంపాడు మహమ్మదాపురం జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఆగిన అదనపు తరగతి గదుల భవనం



దిరిశవంచ జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఆగిన భవన నిర్మాణం



పామూరు: తూర్పు కట్టకింద పల్లిలో ఆగిన ఎంపీయూపీ స్కూల్ భవనం

మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ దుర్మార్గం



సీస్‌పురంలో కోటిసంతకాల సేకరణ ప్రారంభిస్తున్న దద్దాల నారాయణ, నేతలు



హెచ్‌ఎంపాడులో కోటి సంతకాల కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న దద్దాల

- పేద విద్యార్థులకు వైద్య విద్యను దూరం చేసేందుకే వైద్యశాలల ప్రైవేటీకరణ
- వైఎస్సార్ సీపీ కనిగిరి ఇన్‌చార్జి దద్దాల నారాయణ

సీఎస్‌పురం(పామూరు): కూటమి ప్రభుత్వం పేద విద్యార్థులకు వైద్య విద్యను, పేదలకు కార్పొరేట్ వైద్యాన్ని దూరం చేసేందుకే ప్రభుత్వ మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరణ చేస్తోందని, ఇది ఒక దుర్మార్గపు చర్య వైఎస్సార్ సీపీ కనిగిరి ఇన్‌చార్జి డాక్టర్ దద్దాల నారాయణయాదవ్ అన్నారు. వైద్య కళాశాలల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ గురువారం వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో చేపట్టిన కోటి సంతకాల సేకరణలో భాగంగా రచ్చబండ కార్యక్రమాన్ని ఇన్‌చార్జ్ దద్దాల ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాడు ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 17 మెడికల్ కళాశాలలకు అనుమతులు సాధించి నిర్మాణాలు చేపట్టారన్నారు. ఒక్క మెడికల్ కళాశాలను ప్రైవేటీకరణ చేసినా సహించేది లేదని ప్రజల నుంచీ సేకరించిన కోటి సంతకాలను గవర్నర్‌కు అందజేసి ప్రజాభీష్టాన్ని తెలియజేయనున్నట్లు తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం దీనిని ఉపసంహరించుకోవాలని, లేకుంటే చరిత్రహీనులుగా మిగిలిపోతారన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ దుగ్గిరెడ్డి ప్రతాప్‌రెడ్డి, పార్టీ టీయూసీ జిల్లా అధ్యక్షుడు మితికాల గురవయ్య, మాజీ ఎంపీపీ భువనగిరి వెంకటయ్య, బైరెడ్డి తిరుపతిరెడ్డి, మన్నేపల్లి పెద్దన్న, మిరియం వెంకటేశ్వర్లు, బత్తుల దేవరాజ్, ముడియాల నారాయణరెడ్డి, సూరిపోగు ఆంథోని, మోరం మురార్జి, ఓడ లక్ష్మిరెడ్డి, పాలుగుళ్ల సూర్యనారాయరెడ్డి, ఆశం చినబాలిరెడ్డి, అంబాల శేఖర్‌రెడ్డి, రేగులగడ్డ చిన నరసింహులు, పద్మనాభం, కుర్రా చిరంజీవి, దనెంకుల వెంకట్రాజు, యంబడి ప్రవీణ్‌కుమార్, గాదంశెట్టి లక్ష్మీనరసయ్య, గోగుల బాలయ్య, గిద్దా మాల కొండయ్య, బలబద్ర పెద్దన్న, బక్కా జోసఫ్, షేక్. నాయబ్, బోయిన లక్ష్మయ్య, గొబ్బిళ్ల శ్రీనివాసయాదవ్ పాల్గొన్నారు.

హనుమంతునిపాడు: సామాన్య ప్రజలకు విద్య, వైద్యం అందకూడదన్న ఉద్దేశంతో కూటమి ప్రభుత్వం మెడికల్ కాలేజీలను ప్రైవేటీకరణ చేస్తోందని వైఎస్సార్ సీపీ కనిగిరి ఇన్‌చార్జి దద్దాల నారాయణ అన్నారు. మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో కోటి సంతకాల సేకరణలో భాగంగా హనుమంతునిపాడులో కన్వీనర్ యక్కంటి శ్రీనివాసులరెడ్డి అధ్యక్షతన రచ్చబండ నిర్వహించారు. ఈ సందర్భంగా దద్దాల మాట్లాడుతూ పేదలకు ఉచిత విద్య, వైద్యం అందించేందుకు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో సదుద్దేశంతో 17 కాలేజీలకు శ్రీకారం చుట్టారన్నారు. కానీ కూటమి ప్రభుత్వం ఆ ఉన్నత లక్ష్యానికి తూట్లు పొడుస్తుందన్నారు. ప్రైవేటీకరణ చేసి కోట్లు దండుకునేందుకు పన్నాంగం పన్నిందన్నారు. అనంతరం గ్రామంలో జరిగిన రచ్చబండ కార్యక్రమంలో కోటి సంతకాలు సేకరణ చేపట్టారు. మండల పార్టీ అధ్యక్షుడు యక్కంటి శ్రీనివాసలరెడ్డి, మాజీ ఎంపీపీ గాయం బలరామిరెడ్డి మాట్లాడుతూ పేదల వైద్యం ,విద్య పై ముఖ్య మంత్రి చంద్రబాబు కుట్ర పన్నారన్నారు. చంద్రబాబు రాష్ట్రంలో దుర్మాగ, అరాచక పాలన కొనసాగిస్తుందన్నారు. కార్యక్రమంలో జిల్లా రైతు ప్రధాన కార్యదర్శి శ్యామల సాంబిరెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి గాండ్ల పర్తి ఆదినారాయణరెడ్డి, ఎస్సీ సెల్ అధ్యక్షుడు వేశపోగు గురుప్రసాదు, యూత్ అధ్యక్షుడు భవనం క్రిష్టారెడ్డి, సర్పంచ్ సంఘ అధ్యక్షుడు సానికొమ్ము మధుసూదన్‌రెడ్డి, ఎంపీపీలు కొదమల బెంజి, రుద్రపాటి శోభ రాజులు, ఎంపీటీసీ సూరిశెట్టి నారాయణస్వామి, సర్పంచ్ కత్తిరాజారావు, ఇతర నాయకులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ హయాంలోనే సామాజిక న్యాయం



సదస్సులో మాట్లాడుతున్న ఎస్సీ సెల్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి వెంకటరత్నం

పామూరు: వైఎస్సార్‌సీపీతోనే ఎస్సీ, ఎస్టీ, క్రిస్టియన్ మైనారిటీల అభివృద్ధి సాధ్యమని ఎస్సీ సెల్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కటికల వెంకటరత్నం అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో గురువారం పార్టీ మండల అధ్యక్షుడు గంగసాని హుసేన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎస్సీసెల్ మండల అధ్యక్షుడు తాతపూడి రాము అధ్యక్షతన ఎస్సీ, ఎస్టీ, క్రిస్టియన్ మైనారిటీల సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా ఎస్సీసెల్ రాష్టనాయకులు వెంకటరత్నం మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, క్రిస్టియన్ మైనారిటీలంతా కలిసికట్టుగా ఒక్కతాటిపై ఉంటే రాజ్యాధికారం దిశగా అడుగులు వేయవచ్చన్నారు. నాడు వైఎస్సార్‌సీపీ పాలనలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు పెద్దపీట వేశారన్నారు. నామినేటెడ్ పదవుల్లో అధిక ప్రాధాన్యం ఇవ్వడంతో పాటు 50 శాతానికి పైగా పదవులు ఇచ్చి అభ్యున్నతికి కృషి చేసిన ఏకైక సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. కూటమి ప్రభుత్వం మెడికల్ కళాశాలలను ప్రైవేటుపరం చేసి పేద విద్యార్థులకు వైద్యవిద్య, వైద్య దూరంచేయాలని చూస్తోందని, దుయ్యబట్టి దీనిని నిరసిస్తూ కోటి సంతకాల కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. నియోజకవర్గ అధ్యక్షుడు గూడూరి అనిల్‌బాబు మాట్లాడుతూ కూటమినేతల కుయుక్తులకు, బెదిరింపులకు వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు భయపడరన్నారు. తొలుత డాక్టర్ అంబేడ్కర్ చిత్రపటం, డాక్టర్ వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పార్టీ మండల అధ్యక్షుడు గంగసాని హుసేన్‌రెడ్డి, కోఆప్షన్ షేక్.నాయబ్‌రసూల్, ఎస్సీసెల్ మండల అధ్యక్షుడు తాతపూడి రాము, వైస్ ఎంపీపీ గంధం ఏసురత్నం, పార్టీ పట్టణ అధ్యక్షుడు షేక్.చాంద్‌బాషా, గట్లా విజయభాస్కర్‌రెడ్డి, పోతల రమేష్, ఎస్టీసెల్ నియోజకవర్గ అధ్యక్షుడు శ్రీరాం శ్రీనివాసులు, జొన్నలగడ్డ గోవిందయ్య, పాలేటి ప్రేమ్‌కుమార్, ఎలికా అచ్చయ్య, పందిటి గురవయ్య, ఎంపీటీసీ సవరం రత్తమ్మ, ఇండ్లా నందకిషోర్, ఎండ్లూరి సాల్మన్, ఏసు, నరసయ్య, ఎలాషా, మాలకొండయ్య, చినపెద్దయ్య, రాజేంద్ర, సురేష్, ఇస్రాయేలు, యోహాను, జ్యోతిరాజ్, జయరావు, ఎలాయాజర్, హనూక్, అనీల్, చిట్టిబాబు పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

దేవాలయ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలి

కనిగిరిరూరల్: దేవాలయాలు పవిత్రమైన ప్రదేశాలు, వాటిని పరిశుభ్రంగా ఉంచడం వల్ల దైవత్వానికి గౌరవం లభిస్తుందని మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్ అన్నారు. కార్తీక మాసం పర్వదినం పురస్కరించుకొని గురువారం కనిగిరి మార్కండేశ్వర దేవాలయం పరిసరాల ప్రాంతాలను పరిశీలించారు. ఆరోగ్యకరమైన పరిశుభ్రమైన వాతావరణం వల్ల భక్తులు ఆరోగ్యంగా ఉండటమే కాకుండా, శారీరక, మానసిక ప్రశాంతతను పొందగలుగుతారన్నారు. మార్కండేశ్వర దేవాలయం చైర్మన్ వాగి చెర్ల వెంకటేశ్వర్లు, విజేత కళాశాల అధినేత అరుణోదర్, మాజీ ఏఎంసీ డైరెక్టర్ బొట్టు శ్రీనివాసులు, శానిటరీ సెక్రటరీ ప్రసాదు తదితరులు పాల్గొన్నారు.



ఆలయ పరిసరాలు పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్ గఫార్

ప్రత్యేక ఆధార్ కేంద్రాలు ఉపయోగించుకోవాలి

సీఎస్‌పురం(పామూరు):

పాఠశాలల్లో ఏర్పాటు చేస్తున్న ఆధార్ ప్రత్యేక కేంద్రాలను విద్యార్థులు వినియోగించుకోవాలని ఎంఈఓ రాజాల కొండారెడ్డి అన్నారు. మండలంలోని శీలంవారిపల్లె జెడ్పీహెచ్ఎస్, ప్రాథమిక పాఠశాల, కేజీబీవీ టైప్4 హాస్టల్‌ను గురువారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ కేజీబీవీ హాస్టల్‌లో వార్డెన్‌పోస్టును త్వరలో భర్తీ చేస్తామన్నారు. హెచ్ఎం బోడా ప్రసాద్, నారిశెట్టి వెంకటరామయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వైభవంగా అఖండ జ్యోతి ప్రజ్వలన

కనిగిరిరూరల్: స్థానిక షిర్డీ సాయిబాబా దేవస్థానంలో సిద్ధ యోగిని గురు మాతాజీ ఆధ్వర్యంలో సప్త సప్తాహ పారాయణ మహాయజ్ఞం, అఖండ జ్యోతి ప్రజ్వలన కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభమై 49 రోజులు 7 వారాల పాటు సాయి సచ్చరిత్ర పారాయణ కొనసాగుతుంది. దేవస్థానం కమిటీ అధ్యక్షుడు కొప్పరపు సత్యాలు, పరమేశ్వరి దంపతులు సాయిబాబాకు పూజలు చేసి పారాయణ మహాయజ్ఞం ప్రారంభించారు. దేవస్థానం కమిటీ గౌరవ అధ్యక్షుడు కుందురు తిరుపతిరెడ్డి, దేవస్థానం కమిటీ అధ్యక్షుడు కొప్పరపు సత్యాలు, కార్యదర్శి బాలు ఓబులురెడ్డి, సద్గురు సాయి సేవాసమితి అధ్యక్షుడు దేవకి సుబ్రహ్మణ్యం , కోశాధికారి వాగిచెర్ల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ఐక్యతతోనే భూ సమస్యల పరిష్కారం

పామూరు: దశాబ్దాలుగా భూ సమస్యలు పరిష్కారానికి నోచుకోలేదని, భూసమస్యల పరిష్కారానికి రైతులు ఐక్యం కావాలని రైతుసంఘం జిల్లా కార్యదర్శి పమిడి వెంకట్రావు అన్నారు. స్థానిక సుందరయ్య భవన్‌లో గురువారం రైతుసంఘం మండల కమిటీ సమావేశం ఎం ప్రసాదరావు అధ్యక్షతన నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నో ఏళ్ల నుంచి చుక్కల భూమి సమస్యతో రైతులు బాధపడుతున్నా పాలకులకు, అధికారులకు పట్టడం లేదని ఆరోపించారు. సమస్యల పరిష్కారంకోసం ఉద్యమాలు తప్పనిసరన్నారు. ఈనెల 22న పామూరులో రైతుసంఘం విస్తృత సమావేశం జరగుతుందని, రైతులంతా హాజరుకావాలన్నారు. సీఎస్‌పురం మండల కార్యదర్శి ఊసా వెంకటేశ్వర్లు, చిన్న కొండయ్య, వై.జయరావు, కొండయ్య పాల్గొన్నారు.